ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం 18 ఏప్రిల్ 2025



భూములకు.. ఇక దేశవ్యాప్త గుర్తింపు

రైతులకు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు

సాగుదారుల లెక్క ఇక పక్కాగా తేలనున్నది. రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక కార్డుల(భూ ఆధార్)ను అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేశాయి. ఈ ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో ప్రతీ రైతుకు 14 అంకెల విశిష్ట సంఖ్యతో ఈ కార్డులు జారీ కానున్నాయి. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. కేంద్రం అందించే సంక్షేమ పథకాల లబ్ధికి ఈ కార్డు ప్రామాణికంగా నిలవనుంది. భూమి ఉండి, పట్టాదారు పాస్ పుస్తకం కలిగిన ప్రతీ రైతూ ఈ గుర్తింపు తీసుకోవడం తప్పనిసరి. వ్యవసాయ రంగంలో సాంకేతిక అనుసంధానం, ఆధునికీకరణ చర్యల్లో భాగంగా కేంద్రం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది.

- ఈ నెల 22 నుంచి అందించనున్న కేంద్రప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 8.77 లక్షల మందికి భూ ఆధార్ జారీకి కసరత్తు
- అందుబాటులోకి వచ్చిన యాప్.. సిబ్బందికి శిక్షణ పూర్తి
- పీఎం కిసాన్ సమ్మాన్‌కు ఈ కార్డు తప్పనిసరి
- గ్రామాల్లో రైతు వేదికల వద్ద వివరాల నమోదు

హనుమకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టాదారు పాస్‌పుస్తకాలు కలిగిన మొత్తం 8.77 లక్షల మందికి ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ (భూఆధార్) కార్డుల జారీకి వ్యవసాయాధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఈనెల 22 నుంచి ఈ కార్డుల జారీ ప్రారంభం కానున్నది. కార్డులు పొందేందుకు కాలపరిమితేం లేదు. కాకపోతే ఈ కార్డులుంటేనే ఇక నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ డబ్బులు రైతులు పొందగలుగుతారు. వాస్తవానికి ఫిబ్రవరి నెల లోనే ఈ కార్డుల జారీ ప్రక్రియ మొదలు కావలసి ఉండింది. తెలంగాణ రాష్ట్రంలో జాప్యం జరుగు తోంది. ఇతర రాష్ట్రాల్లో ఇప్పటికే 70 శాతం పూర్త యింది. ప్రజల అన్ని అవసరాలకు ప్రధానంగా గుర్తింపు కార్డుగా చెలామణిలో ఉన్న ఆధార్ తరహా లో ఇక నుంచి ప్రతీరైతుకు గుర్తింపు కార్డు తప్ప నిసరి కానుంది.

ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో ప్రతీ రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ చేయడం ద్వారా జాతీయ స్థాయిలో ఈ-ఫార్మర్ రిజిస్ట్రీని రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. పైలెట్ ప్రాజెక్టుగా మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో చేపట్టిన ఈ విధానం విజయవంతం కావడంతో దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో భూ యజమానులతోపాటు కౌలు రైతులకు సైతం వీటిని జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్-అగ్రిస్టాక్ ప్రాజెక్టు పేరిట అమలు చేయబోతున్న ఈ ప్రాజెక్టు కోసం స్టేట్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ (ఎస్‌పీఎంయూ)ను ఏర్పాటు చేశారు. వెట్ ల్యాండ్ డాటా ఆధారంగా జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా రైతుల ఈ-ఫార్మర్ రిజిస్ట్రీని రూపొందిస్తారు.

ఇవీ ప్రయోజనాలు

భూ కమతాలకు విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించటం అంటే భూమికి ప్రత్యేక గుర్తింపు ఇచ్చినట్టు. ఇది భూ యజమాని, స్థానం, విస్తీర్ణం మొదలైన వివరాలను సులభంగా గుర్తించేందుకు ఉపయోగపడుతుంది. భూమి ఉపయోగాన్ని నిర్ధారించవచ్చు. ఆక్రమణలు, అక్రమ కట్టడాలను నివారించటానికి సహాయపడుతుంది. విశిష్ట గుర్తింపు సంఖ్యల వల్ల భూములను బ్యాంకింగ్, బీమా వ్యవస్థలతో సులభంగా అనుసంధానం చేయవచ్చు. భూ యజమాని హక్కులను తేలికగా గుర్తించవచ్చు. దీని వల్ల భూవివాదాలను అరికట్టి పారదర్శకతను పెంచేందుకు ఆస్కారం ఉంటుంది. భూ వివరాలను డిజిటలైజ్ రూపంలో నిల్వ చేయడం సులభమవుతుంది. కేంద్ర అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలకు ఈ యూనిక్ కోడ్ తప్పని సరికానున్నది. పంటలకు కనీస మద్దతు ధర పొందేందుకు, పంటను మార్కెట్‌లో విక్రయించుకునేందుకు ఈ కార్డు ఉపయోగపడుతుంది. దీనిని కిసాన్ క్రెడిట్ కార్డుగా కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ ఐడీ సాయంతో దేశంలో ఎక్కడి నుంచైనా రుణార్హత, రుణ బకాయిలు, పథకాల జమ వంటి వివరాలను తెలుసుకోవచ్చు.

పీఎం కిసాన్‌కు తప్పనిసరి

రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన

మిగతా 7వ పేజీలో...

ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డుల జారీకి ఏర్పాట్లు

రవీందర్ సింగ్, హనుమకొండ జిల్లా వ్యవసాయాధికారి

రైతులకు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డుల జారీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 22వ తేదీ నుంచి కార్డుల జారీ మొదలవుతుంది. ఈ ప్రత్యేక కార్డుల జారీకి సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. ఈ కార్డులు పొందేందుకు రైతులు తమ ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకంతో తమ దగ్గరలోని సహాయ వ్యవసాయ అధికారులు (ఏఈవో)లను సంప్రదించవచ్చు. లేదా మీ సేవా కేంద్రంలో కూడా వివరాలను నమోదు చేయించుకోవచ్చు. కార్డుల జారీకి సంబంధించి యాప్ కూడా సిద్ధంగా ఉంది. రైతుల వివరాలను డిజిటలైజ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. పట్టా పాస్ పుస్తకాలున్న రైతులందరూ ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు పొందాలి. రైతులకు అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

పుష్కరాల పనులు సకాలంలో పూర్తి చేయాలి

సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్



పుష్కర ఘాట్ వద్ద పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

మహదేవపూర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలో మే నెలలో జరిగే సరస్వతీ పుష్కరాల పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ ఆదేశించారు. కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థానం ఈవో కార్యాలయం వద్ద దేవాదాయ, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఇరిగేషన్, విద్యుత్, సింగరేణి, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 15 నుంచి 26 వరకు కాళేశ్వరంలో జరిగే సరస్వతీ పుష్కరాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందని, వారి సంఖ్యకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు, దేవస్థానం ఈవో ఎస్.మహేష్ పాల్గొన్నారు.

అగ్రనేతలపై అక్రమ కేసులు అమానుషం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



పీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై మోదీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం అమానుషమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు విమర్శించారు. కేసులకు నిరసనగా భూపాలపల్లి పట్టణంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను పెట్టడం దారుణమని అన్నారు. ఈడీ అక్రమ కేసులు పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీ మోదీ ప్రభుత్వం చేస్తున్న ఆగడాలను ప్రశ్నించినందుకే అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డాడు. దేశంలోని పేద బడుగుబలహీన వర్గాల ప్రయోజనాల కోసం రాహుల్‌గాంధీ నిరంతరం పోరాడుతూనే ఉంటారని, అక్రమ కేసులకు భయపడేది లేదని అన్నారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయడం, బీసీల కులగణన చేయడం, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని అమలు చేస్తున్న నేపథ్యంలో ఇలాంటి కేసులు బనాయించి తప్పుడు సంకేతాలను పంపాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, నాయకులు చల్లూరి మధు, పిప్పాల రాజేందర్, దాట్ల శ్రీనివాస్, రాంచంద్రయ్య, అప్పం కిషన్, తిరుపతిగౌడ్, ముంజాల రవీందర్, రాజేందర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన శాఖ జిల్లా అధికారిగా సునీల్



కలెక్టర్ రాహుల్‌శర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సునీల్‌కుమార్

కృష్ణకాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన శాఖ జయశంకర్ భూపాలపల్లి అధికారిగా సునీల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ సంచాలకులు యాస్మిన్ బాషా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉద్యాన శాఖకు జిల్లా ఇన్‌చార్జి అధికారిగా పని చేసిన వెంకటేశ్వర్లు బదిలీపై నాగర్‌కర్నూలు జిల్లాకు బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీ అయింది. దీంతో ఇదే శాఖలో భూపాలపల్లి డివిజనల్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న సునీల్‌కుమార్‌కు ఈ జిల్లాకే పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో ఆయన విధుల్లో చేరారు. జిల్లా కలెకర్ రాహుల్‌శర్మను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఇవేం రాకపోకడలు!

- మహారాష్ట్ర టు తెలంగాణ వయా మేడిగడ్డ
- బ్యారేజీపై నుంచి ఇష్టానుసారంగా లోడు వాహనాల ప్రయాణం
- చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు
- నిబంధనల విరుద్ధంగా తిరుగుతున్నా పట్టింపు శూన్యం



బ్యారేజీపై నుంచి వెళ్తున్న సిమెంటు ఇటుకల ట్రాక్టర్



బ్యారేజీపై నుంచి ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న వడ్లు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ నిర్లక్ష్యానికి గురవుతోంది. ఇప్పటికే నాణ్యతా లోపంతో నిర్మించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ బ్యారేజీ మనుగడపై రకరకాలుగా వాదనలు వినిపిస్తున్న క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా దీనిపై ఓవర్‌లోడ్ వాహనాలు దర్జాగా తిరుగుతుండటం, అధికారులెవరూ పట్టించుకోకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. రాత్రింబవళ్లు ఇష్టానుసారంగా అధిక లోడు వాహనాలకు అనుమతినిస్తుండటం చర్చనీయాంశమైంది.

మేడిగడ్డ బ్యారేజీ 2023 అక్టోబరులో కుంగుబాటుకు గురికాగా అప్పటి నుంచి దీనిపై నుంచి రాకపోకలను నిలిపివేశారు. బ్యారేజీ కుంగడానికి ముందు కూడా భారీ లోడు వాహనాలకు బ్యారేజీపై నుంచి వెళ్లేందుకు అనుమతి లేదు. కానీ.. బ్యారేజీ కుంగిన కొన్ని నెలల తర్వాత పర్మిషన్ ఇవ్వడం మొదలెట్టారు. ద్విచక్రవాహనాలే కాకుండా భారీ వాహనాలను యథేచ్ఛగా తిరుగుతున్నాయి. కొందరు కుంగుబాటుకు గురైన బ్యారేజీపై నుంచి ట్రాక్టర్ల ద్వారా వడ్లు, సిమెంటు ఇటుకల తరలింపునకు పూనుకోవడంపై సర్వత్రా విమర్శలు తావిస్తోంది. రాత్రివేళల్లో అయితే భారీ వాహనాలను సైతం అనుమతిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ట్రాక్టర్ల ద్వారా సన్నవడ్లు

మహారాష్ట్రలోని గోదావరి తీరప్రాంతంలో రైతులు యాసంగిలోనూ ఎక్కువగా వరి పంటకే మొగ్గుచూపుతారు. ఈసారి అక్కడ పండించిన ధాన్యాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేసి మేడిగడ్డ మీదుగా తెలంగాణకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం సన్నవడ్ల సాగును ప్రోత్సహించేందుకు యాసంగిలోనూ క్వింటాకు రూ.500 ఇస్తున్నట్లు ప్రకటించడంతో ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు మహారాష్ట్రలో పండించిన సన్న వడ్లకు బోనస్ నొక్కేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మహదేవపూర్ మండలానికి చెందిన ఇద్దరు వ్యాపారులు ప్రతి రోజూ ట్రాక్టర్ల ద్వారా మహారాష్ట్ర నుంచి తెలంగాణకు సన్న వడ్లను తరలిస్తున్నట్టు సమాచారం. ఆతర్వాత వ్యవసాయ శాఖ అధికారుల సహాయంతో నేరుగా మిల్లులకు తరలించి మద్ద తు ధరతోపాటు బోనస్ కొట్టేసే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.. బ్యారేజీ వంతెనపై తెలంగాణ, మహారాష్ట్ర వైపు ఉన్న సిబ్బందిని మచ్చిక చేసుకుని అక్రమంగా సన్న వడ్ల తరలింపునకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

రైతుల పేర్లతో అమ్మకాలు

తెలంగాణలో వరి ధాన్యంతో పాటు పత్తి పంటను అమ్ముకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు టోకెన్ ఇవాల్సి ఉండగా ఇందుకు కొంత మంది అమాయక రైతులను ఎంపిక చేసుకొని క్వింటాకు రూ.200 ఇస్తామని చెప్పి వారే పంటను పండించి అమ్ముకుంటున్నట్టు చిత్రీకరిస్తున్నట్లు తెలిసింది. ఇలా వారి అకౌంట్లలో పడ్డ నగదుతో పాటు బొనస్ డబ్బులు తీసుకునేందుకు ఎత్తులు వేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యాపారులు సీసీఐ పత్తి కొనుగోళ్లలోనూ ఆరితేరినట్టు తెలుస్తోంది. పడావుగా, తక్కువ దిగుబడి వచ్చిన రైతులను దళారుల ద్వారా గుర్తించి, వారికి క్వింటాకు రూ.200 ఇస్తామని నమ్మబలుకుతున్నట్లు సమాచారం. వరితో పాటు పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రంలో అమ్మిన తర్వాత డీబీటీ ప్రాసెస్‌లో డబ్బులు వారి అకౌంట్లలో పడుతుండటంతో ముందే రైతులతో ఒప్పందం చేసుకుని అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నట్టు తెలిసింది. ఇటు వ్యవసాయ, అటు సీసీఐ అధికారులు దృష్టిసారించకపోవడంతో ఈ దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రమాదకరంగా ఉన్న బ్యారేజీ వంతెనపై రాకపోకలను బంద్ చేయాల్సిన అధికారులు భద్రతను గాలికొదిలేసి ఇష్టానుసారంగా అనుమతించడం చర్చనీయాంశంగా మారింది.

యువత సత్తా చాటాలి

- ప్రయత్నిస్తే గెలుపు మీ సొంతం
- భారత కబడ్డీ మాజీ చీఫ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- పాటలతో ఉర్రూతలూగించిన గేయ రచయిత మిట్టపల్లి సురేందర్
- కన్నుల పండువగా కేయూ క్యాంపస్ కళాశాల వార్షికోత్సవం

వివరాలు 7లో..



మాట్లాడుతున్న ఇండియా కబడ్డీ మాజీ చీఫ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

ఖాళీ బిందెలతో మహిళల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మహిళలు, బీజేపీ నేతలు

కాటారం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలో రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధి దేవరాంపల్లి ముదిరాజ్‌వాడలో నీళ్ల సక్రమంగా సరఫరా కావడం లేదని మహిళలు నిరసనకు దిగారు. ఖాళీ బిందెలతో గురువారం రాస్తారోకో చేశారు. కాటారం-మంథని రహదారిపై గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కుటుంబ సమేతంగా ఆందోళన చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి నేతృత్వంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ స్కీం పాయింట్ బోరు అడుగంటి పోయి నీరు రావడం లేదని ఇటీవల ఆందోళన చేయగా మరో బోరు వేశారని, శాశ్వత పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. తాగునీటి కోసం మహిళలు రోడ్డు ఎక్కుతుంటే చర్యలు తీసుకోరా? అని అధికారులను ప్రశ్నించారు. రాస్తారోకోతో ఇరువైపులా వాహనాల భారీ సంఖ్యలో నిలిచిపోవడంతో పోలీసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ ఆందోళనకారులతో మాట్లాడారు. శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపడతామని హామీనివ్వడంతో సమస్య సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో స్వరూప, రజిత, స్నేహ, లక్ష్మి, పద్మ, లక్ష్మి, సరిత, సమ్మయ్య, భీమరాజు, సురేష్, నర్సయ్య, రవి, బీజేపీ నాయకులు దుర్గం తిరుపతి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, జిల్లెల్ల శ్రీశైలం, బండం మల్లారెడ్డి, స్వామి, సింగన్న తదితరులు పాల్గొన్నారు.

బోనస్.. హాంఫట్

- తునికాకు డబ్బుల్లో అక్రమాలు
- సీసీఎఫ్ కాళేశ్వరం విచారణలో కదిలిన డొంక
- జిల్లాలోని నాలుగు రేంజ్‌లలో రూ.38 లక్షలు స్వాహా
- ఒక్క ఏటూరునాగారం దక్షిణ విభాగంలోనే రూ.29లక్షలు
- రికవరీ నిల్.. చర్యలు శూన్యం



ఏటూరునాగారంలోని అటవీశాఖ డివిజన్ కార్యాలయం

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఫారెస్టు అధికారుల అవినీతికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అక్రమాలు ఒక్కొక్కటిగా పుట్టుకొస్తున్నాయి. తునికాకు బోనస్‌లో కొందరు అటవీ శాఖ అధికారులు అవినీతి బోగస్ మల్టీ లెవెల్ కంపెనీల బాగోతాలను తలపిస్తోంది. నిరుపేదలకు చెందాల్సిన డబ్బులను కొందరు అటవీ శాఖ అధికారులు కాజేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తునికాకు బోనస్ డబ్బులన్నీ తమకు అనుకూలంగా ఉండే అర్హులు కాని వారి ఖాతాల్లోకి ముందుగా జమ చేసుకొని, అక్కడి నుంచి తమ జేబుల్లో కుక్కుకుంటున్నారు. ఇలా లక్షలాది రూపాయలను దోచుకున్న ఉదంతం జిల్లా అటవీ శాఖలో చోటుచేసుకుంది.

ఏటూరునాగారం డివిజన్ పరిధితో పాటు పస్రా రేంజ్‌లో భారీగా తునికాకు బోనస్‌లో ఆ శాఖ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న అధికారులే కాజేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అయినా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తుండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' 20రోజుల క్రితం ఈ విషయాన్ని వెల్లడించగా రూ.2.30లక్షల రూపాయలను కాజేశారంటూ జిల్లాలోని పస్రా రేంజ్‌లో పనిచేస్తున్న ఎఫ్ఆర్వోను అరెస్టు చేసి రిమాండ్ పంపారు. కానీ, ఆయా రేంజ్‌ల పరిధిలో లక్షలాది రూపాయలు కాజేసిన అధికారులపై ఎలాంటి చర్యలు తీసకోకపోవడం విస్మయం కలిగిస్తోంది. ఒక్క ఏటూరునాగారం దక్షిణ విభాగం పరిధిలోనే రూ.29,92,094ను తమకు అనుకూలంగా ఉండే వారి ఖాతాల్లో జమ చేయించుకొని కాజేసిన ఆ డబ్బులను రికవరీ కాదు కదా.. అవినీతికి పాల్పడిన అధికారులపై తీసుకున్న చర్యలు శూన్యం.

ఒక్క ఏటూరునాగారం దక్షిణ విభాగంలో రూ.29లక్షలు

తునికాకు సేకరణ 2016నుంచి 2021 కాలానికి సంబంధించిన బోనస్ డబ్బులను ప్రభుత్వం అర్హులకు గత ఏడాది అందించింది. అర్హులకు సంబంధించిన జాబితాను అటవీ శాఖనే గుర్తించి వారి ఖాతాలను తీసుకొని ఆప్‌లోడ్ చేస్తోంది. కానీ, అర్హులతో పాటు కొందరు అటవీ శాఖ అధికారులు తమకు అనుకూలంగా ఉండే బినామీ ఖాతాల్లో భారీ మొత్తంలో తునికాకు బోనస్ డబ్బులను జమ చేసి కాజేశారనే ఆరోపణలున్నాయి. కాళేశ్వరం సర్కిల్ సీసీఎఫ్ శాఖాపరమైన విచారణ చేపట్టగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి.

ఏటూరునాగారం డివిజన్ పరిధిలో గల దక్షిణం విభాగం రేంజ్‌లోనే రూ.29,92,094 కాజేసినట్లు సీసీఎఫ్ తమ విచారణలో వెల్లడించారు. దక్షిణం రేంజ్‌లో అప్పట్లో పనిచేసే ఓ కంప్యూటర్ ఆపరేటర్ తన భార్య పేరు మీదనే రూ.4,00,816, అతని భార్య తల్లి పేరు మీద రూ.2,89,215 జమ చేసుకొని డ్రా చేసుకున్నట్లు విచారణలో వివరాలు తేటతెల్లమైంది. అంతేకాకుండా వీరితో పాటు మొత్తం 15 మంది ఖాతాల్లో లక్ష నుంచి 1.50 వేలకు మించి డబ్బులను ఖాతాల్లో జమ చేశారు. అర్హులు కాని ఖాతాల్లో డబ్బులు జమ చేసి ప్రభుత్వం సొమ్మును దుర్వినియోగం జరిగినట్లు సీసీఎఫ్ విచా రణలో వెల్లడైంది. అదేవిధంగా ఏటూరునాగారం డివిజన్ పరిధిలో ఉత్తరం విభాగం రేంజ్‌లో బోనస్ డబ్బుల్లో అవకతవకలు జరిగాయని గతంలో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. రూ. 2.50లక్షలు కాజేసిన అప్పటి ఎఫ్ఆర్వోను అరెస్టు చేసి రిమాం డ్‌కు తరలించారు.

అవినీతిపరులకు కొమ్ము కాసేదెవరు?

జిల్లాలో అటవీశాఖలో భారీ కుంభకోణం జరిగినట్లు ఆ శాఖ అంతర్గత విచారణలో స్పష్టమైంది. కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ విచారణ జరిపి పీసీసీఎఫ్‌కు నివేదిక గత నెల రోజుల క్రితం పంపించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు రూ.2.50 లక్షల అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చి ఎఫ్ఆర్వోను అరెస్టు చేసి రిమాండ్ తరలించి సస్పెండ్ చేశారు. కానీ, ఏటూరునాగారం దక్షిణ విభాగంతో పాటు పస్రాలో జరిగిన అవకతవకలకు పాల్పడిన అధికారులను గుర్తించినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇంకా విధుల్లోనే కొనసాగిస్తుండటం విస్మయానికి గురిచేస్తోంది. దక్షిణ విభాగంలో అటవీశాఖలో ఓ డిప్యూటీ రేంజర్‌తో పాటు కంప్యూటర్ ఆపరేటర్, ఓ వ్యక్తి, ఓ ఎఫ్‌బీవో, ఓ ఎఫ్ఎస్‌వోపై అభియోగాలు ఉన్నట్లు సీసీఎఫ్ విచారణలో తేలింది. అదేవిధంగా పస్రా రేంజ్‌లో కూడా ఓ ఎఫ్ఆర్వోతో పాటు మరికొందరిపై అభియోగాలు ఉన్నట్లు, ప్రజాధనం దుర్వినియోగం కావడంలో వీరి పాత్ర ఉందని స్పష్టంగా తెలిసినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఆధారాలన్నీ స్పష్టంగా ఉన్నప్పటికీ అవినీతి, అక్రమాలకు తోడ్పాటును అందించిన అధికారులపై చర్యలు లేకుండా పోవడంతో వారిని కాపాడుతున్నదెవరు? అనేది చర్చనీయాంశమైంది. ప్రజా ధనం దుర్వినియోగం కాగా వాటి రికవరీతో పాటు అక్రమాలను పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకొని డబ్బులను రికవరీ చేసి అర్హులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మరో రెండు రేంజ్‌లకూ ఇదే పరిస్థితి..

జిల్లాలోని మరో రెండు రేంజ్‌ల్లోనూ తునికాకు బోనస్ డబ్బుల చెల్లింపుల్లో అక్రమాలు జరిగినట్లు సీసీఎఫ్ తన విచారణలో పొందుపర్చారు. జిల్లాలోని పస్రా రేంజ్‌లో రూ.5,67,313, తాడ్వాయి రేంజ్‌లో రూ.29,150 మేర అక్రమాలు జరిగినట్లు విచారణలో వెల్లడించారు. పస్రా రేంజ్‌లో ఐదుగురి అనర్హుల పేర్లను తీసుకొని వారి ఖాతాల్లో డబ్బులను జమ కాగా, వారి ఖాతాల్లో డబ్బులు అక్రమంగా పడ్డట్లు ఈ విషయాన్ని నం బంధిత అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంలో విఫలం చెందా రని, వారిపై అనుమానాలు ఉన్నట్లు విచారణలో స్పష్టం చేశారు.

నేడు ములుగు జిల్లాలో పర్యటించనున్న మంత్రులు

- వెంకటాపూర్‌లో 'భూభారతి' ప్రారంభోత్సవం

ములుగు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా వెంకటాపూర్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క, కొండా సురేఖ శుక్రవారం పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టాన్ని అమలు చేసేందుకు జిల్లాలో వెంకటాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా మంత్రులు సీతక్క, శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ పర్యటించనున్నారు. భూభారతి కార్యక్రమాన్ని వీరు ప్రారంభించనున్నారు. అనంతరం పీవీసీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న సదస్సులో పాల్గొని రైతులతో మాట్లాడనున్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు

మంగపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పలుచోట్ల మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీ యువజన సంఘం పేరిట బుధవారం రాత్రి కరపత్రాలు వెలిశాయి. కర్రెగుట్టలపైకి ఆదివాసీలు రావొద్దని మావోయిస్టులు హెచ్చరించడం దారుణమని పేర్కొన్నారు. 'మావోయిస్టుల్లారా.. మీ సిద్ధాంతం ఇదేనా?' అని ప్రశ్నించారు.

భూపాలపల్లి జిల్లా పలిమెలలో..

మహదేవపూర్‌రూరల్ (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులకు వ్యతిరేకంగా భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో గురువారం ఉదయం పోస్టర్లు దర్శనమిచ్చాయి. మండలంలోని దమ్మూర్, ముకునూర్ గ్రామాల్లో ఆదివాసీ యువజన సంఘం పేరిట ఈ పోస్టర్లు కలకలం రేపాయి. ఆదివాసీలను వారి జీవనాధారమైన అడవుల్లోకి వెళ్లకుండా బాంబులు పెట్టి అడ్డుకుంటారా? అని అందులో ప్రశ్నించారు. ఆదివాసీలపై ఆంక్షలా.. ఇంకెన్నాళ్లు ఈ అరాచకాలు అని పేర్కొన్నారు. అడవుల్లో బాంబులు.. ఆదివాసీల గుండెల్లో గుబులూ.. మావోయిస్టులారా.. మీకిది తగునా అంటూ ఈ పోస్టర్లు కలకలం రేపాయి. దీనిపై స్థానిక పోలీసులను సంప్రదించగా పోస్టర్లు వెలిసినట్లు తమ దృష్టికి వచ్చిందని.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారయత్నం

- ఉత్తరప్రదేశ్‌కు చెందిన నిందితుడికి దేహశుద్ధి
- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

వరంగల్ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గిర్మాజీపేటలో మూడేళ్ల బాలికపై అత్యాచారయత్నం జరిగిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. సీఐ మహ్మద్ అబ్దుల్ షుకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 33ఏళ్ల రంజాన్ రెండేళ్ల కిందట బతుకు దెరువు కోసం వరంగల్‌కి వచ్చి పెయింటింగ్ పని చేస్తున్నాడు. అతడి భార్య, పిల్లలు ఉత్తరప్రదేశ్‌లోనే కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వరంగల్ గిర్మాజీపేటలో రంజాన్ ఒకఇంట్లోని పైపోర్షన్‌లో అద్దెకు ఉంటు న్నాడు. కింద పోర్షన్‌లో మరో కుటుంబం కూలి పనిచేసుకుంటూ జీవిస్తోంది. ఈ క్రమంలో కింద పోర్షన్‌లో ఉండే అన్నాచెల్లెలు బాలుడు(4), బాలిక(3)తో చనువుగా ఉండే రంజాన్ ఆడుకుందామంటూ వారిని బుధ వారం సాయం త్రం 7గంటలకు తన గదిలోకి తీసుకెళ్లాడు. చాలాసేపటి వరకు పిల్లలు కిందికి రాకపోవడంతో మరో పోర్షన్‌లో ఉండే ఓమహిళ వెళ్లి చూడగా పిల్లలిద్దరూ సెల్‌ఫోన్‌లో ఆడుకుంటూ కనిపించారు. వారిని కిందికి తీసుకెళ్లిన తర్వాత ఇం తసేపు ఏం చేశారని పిల్లల నానమ్మ అడిగింది. దాంతో బాలిక వచ్చీరాని మాటలతో రంజాన్ తనను తాకిన శరీరభాగాలను చూపింది. రంజాన్ అసభ్య ంగా ప్రవర్తించినట్లు గుర్తించిన బాలిక కుటుంబసభ్యులు బాలిక శరీరంపై అతడు తాకరాని చోట తాకినట్లు ఆనవాళ్లు కనిపించడంతో స్థానికులతో కలిసి రంజాన్‌కు దేహశుద్ధి చేసి ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో రంజాన్‌పై పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఉప్పరపల్లిలో పిచ్చికుక్క స్వైరవిహారం

- తొమ్మిది మందిపై దాడి
- భయాందోళనలో ప్రజలు

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం మండలం ఉప్పరపల్లిలో గురువారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. రెండు రోజులుగా ఒక కుక్క గ్రామంలో తొమ్మిది మందిపై దాడి చేసి గాయపర్చింది. రోడ్డు వెంట నడుచుకుంటూ వెళుతున్న వారిపైకి ఎగబడి తల, ముఖంపైనే దాడి చేసి కరిచింది. ఈ కుక్క దాడిలో ఎండీ.అల్లావుద్దీన్, మహబూబీ, మంద రవి, దేశెట్టి సారయ్య, బిజిగ సాయిలు, కంచ కోమల, కట్ల ఎల్లయ్య, కుండె అనూష, కంది పాపయ్యలకు ముఖం, చెవులపై తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారు మహబూబాబాద్, కేసముద్రం ప్రభుత్వ ఆస్పత్రులకు చికిత్సకోసం తరలివెళ్లారు. సాధారణంగా పిచికుక్కలు కాళ్లను కరుస్తాయి. ఇందుకు భిన్నంగా ఈ కుక్క ఎగబడి తలను లక్ష్యంగా చేసుకొని పైకి ఎగబడి దాడి చేయడం గమనార్హం. సదరు పిచ్చికుక్కను గ్రామస్తులు కర్రలతో కొట్టి చంపినట్లు తెలిసింది. ఇలా మరో రెండు, మూడు కుక్కలు ఉండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

పిల్లలు చేతిలో కర్రలు పట్టుకొని పాఠశాలకు బిక్కుబిక్కుమంటూ వెళుతున్నారు. కుక్కలకు రేబీస్ వచ్చినప్పుడు ఇలా కరిచే అవకాశం ఉంటుందని, కుక్క కరిచినప్పుడు తప్పనిసరిగా ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలని పశువైద్యాధికారి విజయ్‌కుమార్ తెలిపారు. కుక్కలను గ్రామంలో నివారించాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఉప్పరపల్లిలో పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన అల్లావుద్దీన్



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహబూబీ

మహిళల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- బస్సు యాత్రకు హనుమకొండ చౌరస్తాలో ఘన స్వాగతం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మహిళల హక్కుల కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మీ కోరారు. ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యాదిలో మహిళల హక్కుల పరిరక్షణ పేరుతో చేపట్టిన బస్సు యాత్ర గురువారం హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయం నుంచి చౌరస్తాకు వరకు కొనసాగింది. జిల్లా ఐద్వా, వివిధ ప్రజాసంఘాల నాయకులు, మహిళలు బతుకమ్మలు, బోనాలు డప్పుచప్పుళ్లతో ఐద్వా జిందాబాద్, మహిళలపై దాడులను అరికట్టాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బస్సు యాత్ర బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వేయిస్తంభాల ఆలయం నుంచి చౌరస్తా వరకు ప్రదర్శనగా కొనసాగింది.

ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎం.రమాదేవి అధ్యక్షతన జరిగిన సభలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ మాట్లాడుతూ.. సమాజంలో సగభాగం ఉన్న మహిళలను రాజ్యాంగంలో సమాన హక్కులు కల్పించినప్పటికీ స్త్రీ, పురుషుల మధ్య అసమానత్వం కొనసాగుతోందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనలో ఇంకా స్త్రీలు వెనుకబడి ఉన్నారని, పోరాడి సాధించుకున్న హక్కులను అమలుపర్చడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మండిపడ్డారు. పీఎం నరేంద్రమోదీ బేటీ బచావో అని చెప్పడం వరకే తప్ప.. మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, అత్యాచారాలను, కుల దురహంకార హత్యల గురించి నోరు మెదపడం లేదని ఆరోపించారు. మణిపూర్ ఘటనలో బీజేపీ మంత్రులు నిందితుల పక్షాన ఉండి వారిపై కేసులు పెట్టొద్దు అంటూ ప్రదర్శన చేయడం దుర్మార్గమన్నారు. బిల్కిస్ భానుపై అత్యాచారం, ఆమె కుటుంబం హత్య కేసులో నేరం నిర్ధారణ జరిగి శిక్ష అనుభవిస్తున్న 11మంది ఖైదీలను విడుదల చేయించి శాలువాలతో సత్కరించారని ఆమె ఆరోపించారు. మహిళ మల్లయోధులపైనా లైంగిక వేధింపులు జరిగినప్పుడు కేసు నమోదు చేయడానికి ఆరు నెలలు పట్టిందని గుర్తుచేశారు. ఆర్జీకార్ ఘటన, మణిపూర్‌లో ఇద్దరు గిరిజన మహిళల సంఘటన రాజకీయ ప్రయోజనం కోసం ఉపయోగించుకున్నారే తప్ప.. బాధితులకు న్యాయం కోసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా హక్కుల పరిరక్షణ, దేశాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కోసం రాష్ట్ర కమిటీ చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని, రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలు చేస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాళ్లు రామతార, శ్వేత, రాధిక, రాణి, అనిత, రాధ, పుష్ప, సీఐటీయూ జిల్లానాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, ఉప్పలయ్య, బొట్ల చక్రపాణి, రజిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోతు వీరన్న, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొడుగు వెంకట్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి సాంబయ్య, మంద సంత్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్, ప్రజానాట్య మండలి నేత కె.సుదర్శన్ పాల్గొన్నారు.

రేపు జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల సర్వసభ్య సమావేశం

వడ్డెపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని పాపులర్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 19న ఉదయం 10 గంటలకు వరంగల్ ఉమ్మడి జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు పులి వీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి మస్తాన్‌లు తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని రిటైర్డ్ పోలీస్ అధికారులందరు ఈ సర్వసభ్య సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

మడికొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ వివాహిత మృతి చెందింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ వివరాల మేరకు.. సిద్ధిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామానికి చెందిన ఏల్పుల మమత(32) కు కాజీపేట మండలం తరాలపల్లికి చెందిన రైతు ఏల్పుల లక్ష్మీనారాయణతో 16 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. కొంత కాలంగా మమత కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆర్ఎంపీ డాక్టర్ వద్ద మందులు తెచ్చుకొని వాడుతున్నా తగ్గడంలేదు. కడుపు నొప్పి భరించలేక ఈనెల 11న రాత్రి 9.30 గంటల సమయంలో పురుగుల మందు తాగి వాంతి చేసుకుంటుండగా భర్త గమనించి 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ మమత గురువారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు వద్దమల్ల సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఆత్మ చైర్మన్‌గా నల్లు సుధాకర్‌రెడ్డి

- సీపీఐకి నామినేటెడ్ పదవి రాష్ట్రంలోనే ప్రథమం



సుధాకర్‌రెడ్డి అభినందిస్తున్న విప్ రాంచందర్‌నాయక్

కురవి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆత్మ(వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ) మరిపెడ డివిజన్ చైర్మన్‌గా మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన నల్లు సుధాకర్‌రెడ్డిని నియమించినట్లు ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ గురువారం ప్రకటించారు. కురవిలో భూభారతి సదస్సు జరిగిన అనంతరం సుధాకర్‌రెడ్డిని ఆత్మ చైర్మన్‌గా ప్రకటించి శాలువాతో సన్మానించారు. ఆయన ప్రస్తుతం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కొనసాగుతున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులకే నామినేటెడ్ పదవులు దక్కడం సహజం. కాంగ్రెస్‌కు మిత్రపక్షంగాఉన్న సీపీఐకి నామినేటెడ్ పదవి కేటాయించడం రాష్ట్రంలోనే ప్రథమం. గత రెండు పర్యాయాలు డోర్నకల్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా సీపీఐ తరుపున సుధాకర్‌రెడ్డి రాంచందర్‌నాయక్ గెలుపు కోసం విస్తృతంగా కృషి చేశారు. ఈ ఎన్నికల్లో రాంచందర్ నాయక్ గెలుపొందడం, కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో తన గెలుపుకోసం కష్టపడ్డ నల్లు సుధాకర్‌రెడ్డికి ఆత్మ చైర్మన్‌గా రాంచందర్‌నాయక్ అవకాశంకల్పించారు. ఈసందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మ చైర్మన్‌గా రైతులకు సాధ్యమైనంత వరకు ఉపయోగ పడతానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, సొసైటీచైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, దేవాలయ చైర్మన్ కొర్ని రవీందర్‌రెడ్డి, బండి వెంకటరెడ్డి, బండి లక్ష్మారెడ్డి, సుఖేందర్‌రెడ్డి, బాలగాని శ్రీనివాస్, శ్యామలశ్రీనివాస్, ఎన్.రాజేందర్‌కుమార్, దడిగెల శరత్ పాల్గొన్నారు.

అధికార పార్టీ కార్పొరేటర్ అనుచరుల వీరంగం

- ఇద్దరు యువకులపై విచక్షణారహితంగా దాడి
- రాయితో కొట్టి బైకును లాక్కొన్న వైనం
- రాజీ కోసం నేతలు, పోలీసుల ఒత్తిడి



బాధిత యువకుడి తలపై గాయాలు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : స్నేహితుడిని ద్విచక్ర వాహనంపై ఇంటిదగ్గర దింపేందుకు వెళ్లిన యువకుడిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ కార్పొరేటర్ అనుచరులు తీవ్రంగా కొట్టి, బైక్‌ను ఎత్తుకెళ్లారు. 14వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఘటనపై బాధితుడు ఫిర్యాదు చేసినా.. అధికార పార్టీ నేతల ఒత్తిడితో హనుమకొండ పోలీసులు కేసు నమోదుపై తాత్సారం చేస్తున్నారు. బాధితుడి పక్షాన నిలవాల్సిన పోలీసులు.. నిందితులకు వత్తాసు పలుకుతూ రాజీపడాలని ఉచిత సలహాలు ఇస్తున్నట్లు తెలిసింది. విశ్వసనీయమైన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ గ్రామపంచాయతీ గాంధీనగర్‌కు చెందిన సిద్దబోయిన చరణ్‌తేజ్.. వరంగల్ కరీమాబాద్‌లో తన బాబాయి ఇంట్లో ఉంటూ పోచమ్మమైదాన్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నాడు. అలాగే హనుమకొండ నయీంనగర్‌లోని ఓ కార్పొరేట్ బట్టల షాపులో పార్ట్‌టైమ్‌గా పనిచేస్తున్నాడు. అలాగే ఏటూరునాగారం మండలానికి చెందిన పోదెం సిసింద్రీ రెడ్డికాలనీలో ఉంటూ అదే షాపులో పనిచేస్తున్నాడు. కాగా, ఈనెల 14న సోమవారం అర్ధరాత్రి సమయంలో చరణ్‌తేజ్.. తన ద్విచక్ర వాహనం పల్సర్‌పై సిసింద్రీని రెడ్డికాలనీలో దింపేందుకు వెళుతున్నాడు. ఈ క్రమంలో రెడ్డికాలనీ రోడ్ నెంబర్ 1 వద్ద ముగ్గురు యువకులు మద్యం మత్తులో బైక్‌ను ఆపారు. ఎక్కడికి వెళుతున్నారని అడుగడంతోపాటు అకారణంగా చేయిచేసుకున్నారు. అక్కడే ఉన్న బండరాయితో చరణ్‌తేజ్ తలపై, కళ్లు, చెవిపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. వెనకాల కూర్చొని ఉన్న సిసింద్రీని సైతం కొట్టి గాయపరిచారు. దీంతో బాధితులు వెంటనే డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకోవడంతో ముగ్గురు యువకులు పరారయ్యారు. కాగా, గాయాలపాలైన యువకులు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొంది ఆరోగ్యం కుదుటపడ్డాక గురువారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. అయితే కేసు నమోదు చేయకుండా రాజీపడాలని పోలీసులు సలహా ఇస్తున్నట్లు విశ్వసనీయమైన సమాచారం. అయితే తన అనుచరులను కాపాడేందుకు అధికార పార్టీ కార్పొరేటర్ పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, తమపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని రోజంతా యువకులు పోలీస్‌స్టేషన్‌లో పడిగాపులు కాసినప్పటికీ కేసు నమోదు చేయకుండా తాత్సారం చేస్తున్నారని సమాచారం.


వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2240	1521
పల్లికాయ (సూక)	6200	5200
పల్లికాయ (పచ్చిది)	4500	3575
కందులు	6821	3022
పెసళ్లు	7506	3022
పత్తి	7525	5300
పసుపు (కాడి)	14117	10534
పసుపు (గోల)	13339	9700
తేజ మిర్చి	12100	9500
డిడి	-	-
వండర్‌హాట్	13000	10000
ఎల్లో మిర్చి	-	-
యూఎస్341	11500	9000
దేశీ	26000	18000
సింగిల్‌పట్టి	18500	15000
దీపిక	12000	10000
తాలు మిర్చి	5000	2500

- వరంగల్ వ్యవసాయం

ఓరుగల్లు ఆధ్యాత్మిక చక్రవర్తి


రఘునాథాచార్యస్వామితో చిన్నజీయర్, ఐఏఎస్ అధికారి రమణాచారి, అర్చకులు (ఫైల్)

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఆయన పూర్తిపేరు శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యులు. పుట్టింది ఏపీలోని కృష్ణా జిల్లా మోటూరు ప్రాంతమైనా ఆయన స్థిరపడింది.. తన అపార పాండిత్య ప్రతిభాపాటవాలకు వేదికైంది మాత్రం వరంగల్‌లోని శివనగర్ ప్రాంతమే. ఒక్క ఓరుగల్లులోనే కాదు సంస్కృతం వినిపించే ప్రతీ చోట ఆయన శిష్యగణమే కనిపిస్తుంది. స్తోత్రం పరిఢవిల్లే ప్రతీ ఇంట్లో వినిపించేది ఆయన నామస్మరణే. వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు చిన్నజీయర్ స్వామి సహా దేశంలోని మరో నలుగురు పీఠాధిపతులకు వేదాల్లో, ఉపనిశత్తుల్లో, శ్రీభాష్యంలో శిక్షణ ఇచ్చిన ఉద్దండ పండితుడిగా రఘునాథాచార్యులు పేరొందారు. సంస్కృత భాషకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఎన్నో గౌరవాలు ఆయన్ను వెతుక్కుంటూ వచ్చాయి. ఆయనను అంబారీ ఎక్కించాయి. ఒకటి కాదు రెండు కాదు ఆయన పొందిన అవార్డులు, రివార్డులు కోకొల్లలు. ఒక్క వరంగల్‌లోనే కాక అనేక ప్రాంతాల్లో నిరాదరణకు గురైన అనేక ఆలయాలకు జీర్ణోద్ధరణ చేశారు. వైష్ణవ సాంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా జీవితకాలం నిలిచిన ఆయన భవిష్యత్ తరాల కోసం వందకు పైగా అద్భుత గ్రంథాలను కానుకగా అందించారు.

ధర్మ పరిరక్షణే ధ్యేయంగా..

వరంగల్ నగరంలో సత్‌సంప్రదాయ పరిరక్షణ సభను ఆవిర్భవింపజేసి తద్వారా ధర్మ పరిరక్షణే ధ్యేయంగా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు రఘునాథాచార్యులు. సంప్రదాయ సిద్ధాంత రహస్యాలు, అధ్యాపనం, రచనా వ్యాసంగం, గ్రంథ ప్రచురణలు, వ్యాఖ్యానాలు, విమర్శణలు, సమున్నత వ్యక్తిత్వంతో నిర్వహించిన ఆర్ష భారతీ స్వరూపులుగా అనేక మంది ప్రముఖుల ప్రశంసలందుకున్నారు. శాస్త్ర రత్నాకరుణిగా, కవిశాబ్దిక కేసరిగా, మహామహోపాధ్యాయుడిగా జాతీయ స్థాయిలో అనేక బిరుదులను అందుకున్నారు. కవుల శబ్ద ప్రయోగాలకు పరవశించిపోయే కవిశాబ్దికకేసరిగా, తర్క, వ్యాకరణ, సాహిత్య, మీమాంసాది, శాస్త్రాల లోతెరిగిన శాస్త్ర రత్నాకర బిరుదు ఆయనకే దక్కింది. వేదాంద శాస్త్రంలోని మత త్రయ భాష్యాలను, ద్రావిడాగమ రహస్య సంప్రదాయ తత్వాలను ఆమూలాగ్రం అవపోసనపట్టిన ఉభయ వేదాంత ప్రవక్తకుడిగా నల్లాన్ చక్రవర్తి పేరొందారు. శ్రీ విష్ణు సహస్రనామ భాష్యం, ముండకోపనిషత్ శ్రీమాలిక స్తుతి, వేద ప్రామాణ్యము, అమృతవర్షిని, శ్రీభాష్యం (తెలుగు వాఖ్యానం) లాంటి 54 గ్రంథాలను తాను స్థాపించిన సత్‌సంప్రదాయ పరిరక్షణ సభ ద్వారా ముద్రింపజేసి ఆధ్యాత్మికతను విస్తృతం చేశారు. సంస్కృత విజ్ఞాన వర్ధిని పరిషత్‌ను కూడా ఆయన స్థాపించారు. తద్వారా మరో 90 గ్రంథాలను రచించి ఆయన ముద్రింపజేశారు. ఇక శ్రీవైష్ణవ సాంప్రదాయానికి నిలువెత్తు రూపంగా కనిపించే నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యస్వామి ఏప్రిల్ 18న శత వసంతాలు పూర్తి చేసుకుంటున్నారు. 2018 అక్టోబరు 13న వరంగల్ శివనగర్‌లో తుదిశ్వాస విడిచిన ఆయన అనుసరించిన మార్గం ఆధ్యాత్మిక సేవలు నిరంతరం వైష్ణవ సంప్రదాయ వాసులను పలకరిస్తూనే ఉన్నాయి. ఆయన మరణ అనంతరం ప్రతియేటా సత్‌సంప్రదాయ పరిరక్షణ సభ ఆధ్వర్యంలో సముద్రాల శఠగోపాచార్య ఆధ్వర్యంలో నిరంతర కార్యక్రమాలు కొనసాగుతుండటం చిన్నజీయర్ స్వామి సహా అనేక మంది స్వామీజీలు పాల్గొనడం సంప్రదాయంగా వస్తోంది.

ఎన్నో పురస్కారాలు..

త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి 1970లో ఉభయ వేదాంతచార్య బిరుదుతో రఘునాథచార్యస్వామిని సత్కరించారు. 1972లో నాటి రాష్ట్రపతి వివి గిరి చేతులమీదుగా కవిశాబ్దిక కేసరి, 1999లో తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం ద్వారా మహామహోపాధ్యాయ, కాకతీయ విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్, శాస్త్ర రత్నాకర, ఉభయ వేదాంత మహోదది, అప్పాజోష్యుల, విష్ణుబొట్ల, కందాలం వారిచే ఉభాయ వేదాంత ప్రవర్తకాచార్య లాంటి బిరుదులతోపాటు విజయవాడలో 2006లో గజారోహణం, కనకాభిషేకం, తులభార స్వర్ణకంకణం, 2015లో తెలంగాణ అవతరణ వేడుకల్లో నాటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా తెలంగాణ ఆవిర్భావ పురస్కారం లాంటివి అందుకొని తనద్వారా ఓరుగల్లు ఖ్యాతిని విశ్వవ్యాపితం చేశారు.

నేడు శత తిరునక్షత్ర వేడుకలు

ఈసారి నల్లాన్ చక్రవర్తుల స్వామి వారి శత తిరునక్షత్ర వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఆధ్యాత్మిక, సంప్రదాయపరులు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. హనుమకొండలోని చిన్న కోవెలగా పేరొందిన శ్రీసీతారామాలయంలో, హనుమకొండ ఎక్సైజ్ కాలనీ శ్రీ వెంకటేశ్వరాలయంలో, అదాలత్ శ్రీభూనీలా సమేత వెంకటేశ్వరాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అంతేగాక స్వామివారి శిష్యులున్న తెలుగు రాష్ట్రాల్లోని మరో 8 ప్రదేశాల్లోనూ రఘునాథచార్యస్వామి శతజయంతి వేడుకలు జరగనున్నాయి. ఇక 20వతేదీన ఎస్‌ఆర్ విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి- సుమతిరెడ్డి ఆధ్వర్యంలో అన్నసాగర్‌లోని ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయం వేదికగా అనేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనేక మంది పండితులకు శ్రీనాథ దేశిక విశేష పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. త్రిదండి చిన్నజీయర్‌స్వామి సహా అనేక మంది పండితులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

- ధర్మపరిరక్షణే ధ్యేయంగా ఎందరికో శిక్షణనిచ్చిన పండితుడు రఘునాథాచార్యులు
- నేడు స్వామి శత తిరునక్షత్ర వేడుకలు
- పలు ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలకు ఏర్పాట్లు
- 20న రంగనాథ ఆలయంలో వేడుకలు.. చిన్నజీయర్ రాక
- పలువురు ప్రముఖులకు రఘునాథ దేశిక విశిష్ట పురస్కారాలు


రఘునాథాచార్యస్వామి (ఫైల్)

నాటివే పూర్తి కాలే.. ఇప్పటివెప్పుడు పూర్తయ్యేను?

- సరస్వతీ పుష్కరాలకు ఉన్నది 28 రోజులే
- రూ.25 కోట్ల అభివృద్ధి పనులపై కానరాని పట్టింపు


పుష్కర ఘాట్ వద్ద నత్తనడకన సాగుతున్న పనులు

మహదేవపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాలు సమీపిస్తున్నాయి. మరో 28రోజుల్లో సరంభం ప్రారంభం కానుంది. ఈ క్రమంలో తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో జరిగే సరస్వతీ పుష్కరాలకు చేపట్టిన పనులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొమ్మిదేళ్ల క్రితం ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనులే నేటికి పూర్తికాలేదని, ఇప్పటి పుష్కరాల పనులు ఎప్పటికి పూర్తయ్యేను అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మే 15 నుంచి 26 వరకు సరస్వతి పుష్కరాలు జరుగనున్న నేపథ్యంలో కాళేశ్వరంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. గతంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయ అభివృద్ధికి రూ.25కోట్లు మంజూరు చేసినా ఆ పనులు నేటికీ పూర్తి కాలేదు. ఆయా పనులపై కలెక్టర్లు, ఉన్నతాధికారులు పలు సమీక్షలు, సమావేశాలు నిర్వహించినా ఇంతవరకు ఎలాంటి అడుగు పడలేదు. సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టితో రూ.25 కోట్లు మంజూరు చేశారు. దేవాదాయ దర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యార్, పలువురు అధికారులు, కలెక్టర్ ఆయా పనులపై పలు మార్లు సమావేశాలు, సమీక్షలు నిర్వహించారు. సరస్వతీ ఘాట్‌లో పనులు కొన్ని ప్రారంభమైనా అవి నత్తనడకన సాగుతున్నాయి. కాళేశ్వరంలో పలు శాఖలకు చెందిన అభివృద్ధి పనుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. దేవాదాయ, పంచాయతీరాజ్ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సమన్వయం లేకపోవడంతో పనుల నిర్వహణ పర్యవేక్షణ కొరవడింది. సరస్వతీ పుష్కరాలకు కేవలం 28 రోజులే మిగిలి ఉండడంతో పనులు పూర్తయ్యేనా లేదా అనే సందిగ్ధం ఏర్పడింది. వేసవి కాలం కావడంతో ఇబ్బందులు తప్పేలా లేవని, నిధుల మంజూరు చేసినా ఫలితం లేదని, పనుల ప్రగతి అంతంత మాత్రంగానే ఉందని భక్తులు ఆక్షేపిస్తున్నారు.

కలిసిరాని రూ.25 కోట్లు పనులు

తొమ్మిదేళ్ల క్రితం రూ.25కోట్ల నిధులు మంజూరు కాగా సరస్వతి పుష్కరాలకు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటివరకు గత పనులే నత్తనడకన సాగుతుండగా.. తాజా పనులదీ కూడా అదే పరిస్థితి ఉండటంపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను కాళేశ్వరంలోనే ఉంచి పనులను రాత్రింబవళ్లు పూర్తి చేయించాలని భక్తులు కోరుతున్నారు.

యువత సత్తా చాటాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): యువత కష్టపడి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే జీవితంలో అనుకున్నది సాధించవచ్చని భారత కబడ్డీ జట్టు మాజీ చీఫ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఉద్బోధించారు. గురువారం కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ అధ్యక్షతన కళాశాల వార్షికోత్సవం, క్రీడోత్సవం జరిగింది. ప్రముఖ గేయ రచయిత, మిట్టపల్లి సురేందర్, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ బి.సుకుమారి, డాక్టర్ మల్లం నవీన్, డాక్టర్ బి.రమ, కారుకాల అనితారెడ్డి, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, పుల్లూరు సుధాకర్‌తో పాటు అన్ని విభాగాల అధిపతుల సమక్షంలో వీసీ అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా లింగంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సంగారెడ్డిలోని మారుమూల ప్రాంతంలో జన్మించి కష్టపడి కబడ్డీ క్రీడలో రాణించినట్లు వెల్లడించారు. యుద్ధం, క్రీడల్లో గెలిచిన సందర్భంలో భారతదేశ జాతీయ జెండా ఇతర దేశాల్లో ఎగురవేస్తారని, తమ కబడ్డీ జట్టు పాకిస్థాన్‌పై గెలిచి జెండాను పాకిస్థాన్‌లో ఎగురవేశామని ఉద్వేగంగా ప్రకటించారు. చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. నిరుత్సాహాన్ని వీడి గెలుపునకు ప్రయత్నించాలన్నారు. వర్సిటీ క్యాంపస్ విద్యార్థి జీవితంలో కీలకమన్నారు. ప్రముఖ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్ మాట్లాడుతూ.. యువత లక్ష్యంపై గురి ఉండాలని, సమాజ మార్పు యువతతోనే సాధ్యం అవుతోందన్నారు. తాను పీడిత వర్గాలవైపు నిలబడి పాటలు రాస్తున్నానని, శ్రామిక వర్గాలైన డ్రైవర్లు, రైతులు, అణచివేతకు గురైన వారే తన పాటలకు వస్తువన్నారు. సినిమా పాటల్లో అశ్లీలసాహిత్య సృజన చేయనని వెల్లడించారు. వరంగల్ జిల్లా, వెలిశాల గ్రామం, సెల్‌ఫోన్‌లపై తను రాసిన పాటలను సందర్భనుసారంగా పాడుతూ విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని కల్పించారు. కేయూపై పాటరాసి ఇక్కడే ఆవిష్కరిస్తానని ప్రకటించారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టుదల, కష్టించేతత్వం, నిలకడగా ప్రయత్నిస్తే గెలుపు సాధ్యమవుతుందన్నారు. కేయూను మరింత ముందుకు తీసుకెళ్లాలని, సాంస్కృతిక ఉత్సవాలు విద్యార్థులకు కొత్త ఉత్సాహాన్నిస్తాయని, క్రీడల్లో యువత రాణించాలని సూచించారు. పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ నిమ్మ సుదర్శన్ మాట్లాడుతూ.. జీవితంలో ఎదిగిన వారంతా కష్టపడి పైకివచ్చిన వారేన్నారు. ఓరుగల్లుకు సాహిత్యవారసత్వంతో పాటు ధిక్కార స్వరం ఉందన్నారు. డాక్టర్ బి.సుకుమారి, అనితారెడ్డి, రమ మాట్లాడుతూ.. ప్రతీఒక్కరికీ ఒక్కోరంగంలో అద్భుత నైపుణ్యాలుంటాయని, వాటిని గుర్తించి జీవితంలో స్థిరపడాలని అన్నారు. డాక్టర్ మల్లం నవీన్, పుల్లూరి సుధాకర్, చిర్రా రాజుగౌడ్‌లు మాట్లాడుతూ.. యవత తన జీవితం గెలిచి తమ జీవితాన్ని స్వార్థకం చేసుకోవాలని చెప్పారు. అధ్యక్షత వహించిన తాళ్ళపల్లి మనోహర్ మాట్లాడుతూ.. కేయూ చరిత్రలో స్పోర్ట్స్‌డే, సాంస్కృతిక సంబురాలు, క్రీడోత్సవాలు ఎల్లప్పుడూ నిలుస్తాయని అన్నారు. క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత సభకు స్వాగతం పలికారు. ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న, మంజుల, సుజాత, పోడేటి శ్రీనివాస్, ముంజుం శ్రీనివాస్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్‌లు సమన్వయకులుగా వ్యవరించారు. ఈ కార్యక్రమంలో కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ వై.వెంకయ్య, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ శేషాల కుమార్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కేయూలోని వివిధ విభాగాధిపతులు ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, జి.షమిత, ఎం.స్వర్ణలత, బి.లలితకుమారి, బి.దీపాజ్యోతి,బి. రాధికారాణి, ఆర్.భారవిశర్మ, పి.వెంకటయ్య, టి.శాస్త్రి, జి.మంజుల, ఎస్.మల్లేశ్వర్, సీహెచ్.రాజ్‌కుమార్, జే.శ్రీనివాస్, కె.మధుకర్‌రావు, ఎస్.వెంకటయ్య, ఎం.లింగయ్య పాల్గొన్నారు.

- ప్రయత్నిస్తే గెలుపు మీ సొంతం
- భారత కబడ్డీ మాజీ చీఫ్ కోచ్ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- పాటలతో ఉర్రూతలూగించిన గేయ రచయిత మిట్టపల్లి సురేందర్
- కన్నుల పండువగా కేయూ క్యాంపస్ కళాశాల వార్షికోత్సవం





మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, వేదికపై ప్రముఖులు



క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ట్రోఫీలు బహూకరిస్తున్న భారత కబడ్డీ జట్టు మాజీ చీఫ్ కోచ్ శ్రీనివాస్‌రెడ్డి వీసీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో వీసీ ప్రతాప్‌రెడ్డి, ఇతర అధికారులు

అంబరాన్నంటిన సాంస్కృతిక సంబురాలు

కాకతీయ యూనివర్సిటీలో గురువారం సాయంత్రం కేయూ క్యాంపస్ కళాశాల వార్షికోత్సవం, క్రీడోత్సవాల సందర్భంగా జరిగిన సాంస్కృతిక సంబురాలు అంబరాన్ని అంటాయి. ఫైన ఎర్రన్న, కందికట్ల విజయ్, అనితయాదవ్ బృందం ఆలపించిన గీతాలు అలరించాయి. ప్రత్యేక అర్కెస్ట్రా బృందం పసందైన సంగీతాన్ని అందించారు. క్లాసికల్ డ్యాన్స్‌లు, గ్రూప్ డ్యాన్స్ సోలో డ్యాన్స్‌లతో క్యాంపస్ ఆడిటోరియం హోరెత్తింది. ఆట పాటలకు విద్యార్థులు కోరస్ కలిసి నృత్యాలు చేస్తూ పాటలు పాడారు. సాంస్కృతిక కార్యక్రమాలకు కేయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ నేతృత్వం వహించి సమన్వయం చేశారు.


పాటలు పాడుతున్న ప్రముఖ గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, కళాకారులు

భూములకు ఇక దేశవ్యాప్త గుర్తింపు

5వ పేజీ తరువాయి

భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేయటం ద్వారా యూనిక్ కోడ్‌ను రూపొందిస్తారు. 14 అంకెలతో కూడిన విశిష్ట సంఖ్య ఏ రకమైన చట్టబద్ధ యాజమాన్య హక్కులు కల్పించదు. కేవలం రెవెన్యూ శాఖ వద్దనున్న భూ యాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకొని రైతులకు గుర్తింపు సంఖ్య కేటాయిస్తారు. సీఎం కిసాన్ సమ్మాన్ పథకం లబ్ధిదారులకు తదుపరి విడత సొమ్ములు జమ చేసేందుకు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీని ప్రామాణి కంగా తీసుకోవాలని కేంద్రం మార్గదర్శకాలిచ్చింది.

ఆధార్‌తో అనుసంధానం

రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు ఆధార్ కార్డుతో పాటు దానితో అనుసంధానించిన మొబైల్ నెంబర్, భూ యాజమాన్య పాస్ పుస్తకం కావాలి. వీటి ఆధారంగా ఆయా క్లస్టర్ల పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారులు రైతులకు గుర్తింపు సంఖ్యలు కేటాయిస్తారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితరాలకు ఈ గుర్తింపు సంఖ్యకు ఎలాంటి సంబంధం ఉండదు. కేవలం కేంద్ర ప్రభుత్వ పథకాలకు మాత్రమే దీనిని ప్రామాణికంగా తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

శిక్షణ

రైతు గుర్తింపు కార్డులకు సంబంధించి ఇటీవల హైదరాబాద్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో అన్ని జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. రైతులు, భూముల వివరాలతో ఈ- ఫార్మర్ రిజిస్ట్రీని ఎలా రూపొందించాలనే విషయంలో అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతీ భూ కమతానికి 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపుపై మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో తదుపరి శిక్షణా కార్యక్రమం త్వరలో నిర్వహిస్తారు. దీనిపై అన్ని మండలాల ఏఓలు, ఏఈఓలకు రైతు వేదికల్లో శిక్షణ ఇస్తారు.

రైతు వేదికల్లో నమోదు

జిల్లాల వారీగా ప్రస్తుతం రైతు వేదికల్లో లేదా ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసి అక్కడ రైతుల వివరాలను నమోదు చేస్తారు. ఈ నమోదు కార్యక్రమాన్ని ఈనెల 22 నుంచి ప్రారంభించనున్నారు. రైతులు సంబంధిత వివరాలు తీసుకువెళ్లి మండల విస్తరణాధికారులు, లేదా వ్యవసాయాధికారులను సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. వెంటనే రైతు మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఈ నెంబరును సిబ్బందికి తెలియజేస్తే 14 అంకెల ప్రత్యేక గుర్తింపు నెంబరు వస్తుంది. గ్రామాల వారీగా నమోదును పూర్తి చేస్తారు. ఈ రోజుల్లో రైతులు అందుబాటులో లేకపోయినా తర్వాత కూడా నమోదు చేసుకోవచ్చు.

రైతులు...

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు 8,77,173 మంది ఉన్నారు. వీరందరు ఈ-ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులు పొందేందుకు అర్హులు. హనుమకొండ జిల్లాలో 1,50,982 మంది, వరంగల్ జిల్లాలో 1,54,405 మంది, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1,16,574 మంది, ములుగు జిల్లాలో 76,692 మంది, జనగామ జిల్లాలో 1,85,937 మంది, మహబూబాబాద్ జిల్లాలో 1,92,583 మంది రైతులు ఉన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో నాయకత్వ లక్షణాలు

కల్నల్ విజయ్ కుమార్

హనుమకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీసీ శిక్షణ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను, దేశభక్తి, సేవాదృక్పథాన్ని పెంపొందిస్తుందని 1 (టి) సీటీఆర్ ఎన్‌సీసీ వరం గల్ యూనిట్ కమాం డింగ్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ లెఫ్టినెంట్ కల్నల్ విజయ్ కుమార్ అన్నారు. గురువారం వరంగల్ నిట్‌లో ఎన్‌సీసీ విద్యార్థు లకు సర్టిఫికెట్ ప్రదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి ఎన్‌సీసీలో చేరి శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. నిట్ ఎన్‌సీసీ క్యాడెట్లు సామాజిక కార్యక్రమాల్లో చూపు తున్న సేవాభావాన్ని కొనియాడారు. విద్యార్థులు సర్టిఫి కేషన్ కోర్సుల్లో ప్రతిభ చూపినందుకు ప్రశంసలు కురిపించారు. వరంగల్ నిట్ విద్యార్థులు ఎన్‌సీసీ పరీక్షల్లో ప్రతిభ చాటారు. 23 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. వారికి సర్టిఫికెట్లు అందజేశారు. మొత్తం 23 మంది విద్యార్థుల్లో 17 మంది బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఎన్‌సీసీ బి సర్టిఫికెట్లను, 6గురు బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులు సీ సర్టిఫికెట్లను పొందారు. ఈ పరీక్షలు ఇటీవల వరంగల్‌లోని ఎల్‌బీ కాలేజీలో నిర్వహించారు. విద్యార్థుల్లో చాలామంది ఏ గ్రేడ్ సాధించగా మిగతా వారు బి గ్రేడ్ సాధించారు. ఈ కార్యక్రమానికి జూనియర్ కమాండింగ్ ఆఫీసర్ రాహుల్ హాజరయ్యారు. విజయవంతంగా పరీక్షలు పూర్తి చేసిన క్యాడెట్లకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం విజయ్ కుమార్ ఎన్ఐటీ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్‌ను కలిసి నిట్ ఎన్‌సీసీ విద్యార్థులను అభినందించారు.


సర్టిఫికెట్లతో నిట్ ఎన్‌సీసీ విద్యార్థులు



- కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్ష పదవికి పేరు పరిశీలన
- వారసుడిని తీసుకొచ్చేందుకు సీతక్క ప్రయత్నాలు
- సూర్య కాదంటే మళ్లీ 'పైడాకుల'కే అవకాశం?
- లేదంటే 'గొల్లపల్లి'కి చాన్స్ ?
- రేసులో మరో నలుగురైదుగురు
- జిల్లా అధ్యక్ష పదవిపై కాంగ్రెస్‌లో ఉత్కంఠ

డీసీసీ పీఠంపై సూర్య?

ములుగు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవిపై ఉత్కంఠ నెలకొంది. అన్ని జిల్లాల్లో నూతన కమిటీలను నియమించేందుకు టీపీసీసీ కసరత్తు చేస్తుండగా ములుగు జిల్లా కార్యవర్గం ఏర్పాటు అంశం ఆసక్తికరంగా మారింది. మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఎవరికి దక్కుతుం దనే ఉత్కంఠ క్యాడర్‌లో నెలకొంది. డీసీసీ పీటంపై తన రాజకీయ వారసుడిగా సూర్యను కూర్చోబెట్టేందుకు మంత్రి సీతక్క ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఒకవేళ సూర్య కాదంటే ప్రస్తుత అధ్యక్షుడు పైడాకుల అశోక్‌ను కొనసాగిస్తారా.. లేక మంత్రికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న కిసాన్ సెల్ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్‌కు అవకాశం ఇస్తారా? అనే చర్చ జరుగుతోంది. వీరితోపాటు మరో నలుగురైదుగురు నేతలు డీసీసీ పీఠంపై కన్నేయటంతో పగ్గాలు ఎవరి చేతికి వస్తాయనే ఉత్కంఠ నెలకొంది.

క్రియాశీల రాజకీయాల్లోకి మంత్రి తనయుడు

మంత్రి సీతక్క తనయుడు సూర్యను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావాలని మంత్రి ప్రయత్నాలు చేస్తున్నారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా పినపాక నియోజకవర్గం నుంచి ఆయనకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని సీతక్క అధిష్ఠానంపై తీవ్ర ఒత్తిడి తెచ్చారని తెలిసింది. అయితే.. అప్పటి రాజకీయ సమీకరణ నేపథ్యంలో సూర్యకు ఎమ్మెల్యే టికెట్ చేజారింది. ఈ క్రమంలో వచ్చే అసెంబ్లీ నాటికి సూర్యను రాజకీయంగా క్రియశీలకంగా చేయటంతో పాటు ప్రజల్లోకి వెళ్లి పట్టు సాధించేలా ప్రణాళికను మంత్రి రూపొందిస్తున్నారనే చర్చ జరుగు తోంది. ఇప్పటికే ములుగు నియోజకవర్గంలో కాంగ్రెస్ క్యాడర్‌కు అందు బాటులో ఉంటున్న సూర్యను మరింత క్రియశీలకం చేసేందుకు ప్రయ త్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ములుగు కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవిని సూర్యకు అప్పగిస్తే ఎట్లా ఉంటుందని తన సన్నిహితుల వద్ద సీతక్క చర్చిస్తున్నట్లు తెలిసింది. మంత్రిగా ఎక్కువ సమయం హైదరాబాద్‌లో ఉండాల్సి రావటంతో ములుగు కేంద్రంగా పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు సూర్యకు అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వెల్లడించినట్లు సమాచారం. దీంతో ములుగు జిల్లా కాంగ్రెస్ పగ్గాలు సూర్య చేతికి దక్కటం ఖాయమనే చర్చ పార్టీలో జరుగుతోంది. రాజకీయాల్లోకి వారసుడిని తీసుకొచ్చేందుకు కూడా ఇదే సరైనా సమయంగా భావిస్తున్నారు. 2026లో డీలిమిటేషన్‌లో కొత్తగా ఏర్పడే నియోజకవర్గాల్లో ఏటూరునాగారం కూడా ఉంటుందని ప్రచారం సాగుతోంది. దీంతో ప్రజల్లో ఉంటేనే భవిష్యత్తు ఎన్నికల్లో టికెట్ అడిగే అవకాశం ఉంటుందని సీతక్క భావిస్తున్నట్లు తెలుస్తోంది.

పైడాకులనే కొనసాగిస్తారా..
గొల్లపల్లికి చాన్స్ ఇస్తారా?

ములుగు జిల్లా అధ్యక్షుడి పదవిని సీతక్క వారసుడు సూర్య కాదనుకుంటే ఎవరికి దక్కుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ మంత్రి సీతక్కకు సన్నిహితుడిగా పేరుంది. దీంతో అశోక్‌నే ఈ టర్మ్ కూడా కొనసాగిస్తారా? అనే చర్చ కూడా జరుగుతోంది. రెండు, మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో అధ్యక్షుడిని మార్చడం కంటే అశోక్‌నే కొనసాగిస్తారా? అనేది కూడా కార్యకర్తల్లో చర్చనీయాంశంగా మారింది.

అయితే.. అతను ములుగు జడ్పీ చైర్మన్ సీటుపై కన్నేశారనే ప్రచారం జరుగుతోంది. దీంతో పార్టీ పదవి కంటే జడ్పీ చైర్మన్ పదవిపైనే ఆయనకు ఆసక్తి ఉన్నట్టు తెలుస్తోంది.

ఈ క్రమంలో మంత్రి సీతక్కకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ పేరు కూడా వినిపిస్తోంది. మొదటి నుంచి సీతక్కతో కలిసి పనిచేస్తున్న రాజేందర్ సేవలను పార్టీకి వినియోగించుకోవచ్చుననే ప్రచారం కూడా ఉంది.

అయితే.. రాజేందర్‌కు మరోసారి మార్కెట్ కమిటీ లేదా ఏదైనా కీలకమైన నామినేటెడ్ పదవి ఇస్తారనే చర్చ కూడా జరుగుతోంది.

డీసీసీ రేసులో మరికొందరు

కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో పాటు స్థానిక ఎమ్మెల్యే సీతక్క మంత్రిగా ఉండటంతో అధ్యక్ష పదవిపై పలువురికి ఆశలు పెరు గుతున్నాయి. సీతక్క కుమారుడు సూర్య కాదంటే డీసీసీ జిల్లా అధ్యక్షుడి పదవికి గొల్లపల్లి రాజేందర్‌గౌడ్‌తో పాటు జిల్లా గంథ్రాలయ కమిటీ చైర్మన్ రవి చందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రామిరెడ్డి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. పార్టీలో అనేక ఏళ్లుగా పని చేస్తున్న సీనియర్ నేతలు మరికొందరు కూడా డీసీసీ పీఠంపై కన్నేశారు. అయితే.. మంత్రి సీతక్క నిర్ణయం కీలకం కావటంతో ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి సూర్య కాదంటే ఈ ఐదారుగురిలో ఎవరికి దక్కుతుందనే చర్చ కార్యకర్తల్లో జరుగుతోంది.

పంట నష్టంపై నివేదిక అందించండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ, వాణిజ్య పంటల నివేదికను అందజేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ ఇటీవల జిల్లాలో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన పంటల నివేదికపై సమీక్షించారు. మార్గదర్శకాల ప్రకారం అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. పంట నష్టం జరిగిన రైతులకు పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి వీరునాయక్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవాన్ని విజయవంతం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



బైక్ ర్యాలీలో వెంకటరమణారెడ్డి

టేకుమట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి రతతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. మండలంలోని వెంకట్రావుపల్లి, బూర్నపల్లి, ద్వార కపేట, రామకిష్టాపూర్(వి), వెలిశాల, గర్మిళ్లపల్లి, రాఘవపూర్, ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లి, పెద్దంపల్లి, టేకుమట్ల, అంకుషాపూర్, సోమన్‌పల్లి, రామకిష్టాపూర్(టి), సుబ్బక్కపల్లి గ్రామాల్లో ఆయన బీఆర్‌ఎస్ నాయకు లతో కలిసి గురువారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముఖ్యకా ర్యకర్త లతో సమావేశయ్యారు. ఈ నెల 27న వరంగల్‌లో జరగనున్న పార్టీ రజ తోత్సవ బహిరంగ సభకుఅధిక సంఖ్యలో తరలి రావాలని కోఆరు., ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి, మండల ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, మాజీ ఎంపీపీ రెడ్డిమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కుమారస్వామి పశు పోషకులకు సూచించారు. మండలంలోని అంకుశాపురం గ్రామంలో గురువారం ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం జరగ్గా 80 పశువులకు టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి రాకేషశర్మ, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

'చిన్న కాళేశ్వరం' కెనాల్ భూసేకరణ సర్వే

కాటారం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గూడూరు పరిధిలో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం కోసం భూసేకరణపై గురువారం సర్వేయర్ జీవన్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఆదివారంపేట డెలివరీ సిస్టర్న్‌లో భాగంగా మెయిన్, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మాణంలో భాగంగా చేపడుతున్న సర్వేలో కొంతమంది రైతులు పాల్గొని తమభూముల వివరాలను నమోదు చేసుకున్నారు.

ఈజీఎస్ పనులను తనిఖీ చేసిన డీఆర్‌డీవో

కాటారం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి జీపీ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లా అధికారి పల్లికొండ నరేష్ గురువారం తనిఖీ చేశారు. పని ప్రదేశాల్లో నీటి, నీడ, ప్రాథమిక చికిత్సకిట్ సౌకర్యాలు కల్పించాలని కార్యదర్శులు, ఉపాధి అధికారులను ఆదేశించారు. కూలీలు గరిష్ఠ వేతనం రూ.307 పొందేలా పనులు కేటాయించాలన్నారు మస్టర్ల వెరిఫికేషన్ సక్రమంగా చేయా లన్నారు. ఆయన వెంట ఎంపీడీవో అడ్డూరి బాబు, ఏపీవో వెంకన్న ఉన్నారు.

ప్లాంటు ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

మల్హర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : సీఎస్‌ఆర్ నిధుల ద్వారా తాడిచర్లలో ఏఎమ్మార్ కంపెనీ నిర్మించబోయే వాటర్ ప్లాంట్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్‌కో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. తాడిచర్ల గ్రామ ప్రజలకు తాగునీటి కొరత తీర్చేందుకు స్వచ్ఛమైన తాగునీటిని అందిం చేందుకు ఆర్‌ఓఆర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని గత పదిహేను రోజుల క్రితం ఏఎమ్మార్ వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథరాజును కోరారు. ఈ కార్యక్రమంలో తాండ్ర మార్కు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీకి గాయాలు

మహదేవపూర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలో గురువారం ఉపాధి హామీ పనులకు వెళ్లిన ఆ గ్రామానికి చెందిన లేతకారి జక్కమ్మ అనే మహిళలకు గాయాలయ్యాయి. ప్రమాదవశాత్తు పని చేస్తూ కిందపడడంతో కుడి చేయి విరిగింది. వెంటనే అక్కడి సిబ్బంది ఆస్పత్రికి తరలించి ఆమెకు వైద్యం అందించారు.

ప్రతి దరఖాస్తునూ పరిశీలీస్తాం

రెవెన్యు సదస్సులో కలెక్టర్ దివాకర టీఎస్

వెంటాపూర్, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): భూభారతిపై వచ్చిన దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని ములుగు కలెక్టర్ దివాకర అన్నారు. గురువారం వెంకటాపూర్ మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన మాటాడారు. గత ధరణి చట్టంలోని అంశాలే కాకుండా మరో 14 నూతన అంశాలను భూభారతిలో ప్రభుత్వం పొందుపర్చిందన్నారు. క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించడానికి చట్టాన్ని రూపొందించిందన్నారు. భూములపై హక్కు పత్రాలు పొందడానికి భూభారతి చట్టం దోహదపడుతుందన్నారు. రైతులు సమర్పించే ప్రతి దరఖాస్తు నూ మండల స్థాయి అధికారులు పరిశీలిస్తామన్నారు. అంతేకాకుండా కలెక్టర్ స్థాయిలోనూ పరిశిలించి భూములకు హద్దులు ఏర్పాటు చేస్తామ న్నారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, రెవెన్యూ సదస్సుల ఇన్‌చార్జి ఆఫీసర్ కిరణ్ ప్రకాశ్, ఆర్డీవో వెంకటేశ్, వెంకటాపూర్ తహసీల్దార్ బాద గిరిబాబు పాల్గొన్నారు.



నర్సాపూర్ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

భూభారతి చట్టంతో సమస్యల పరిష్కారం

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో రైతుల భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ములుగు కలెక్టర్ దివాకర అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో తహసీల్దార్ సురేష్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ధరణి స్థానంలో భూభారతి చట్టం వచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా రైతులు 14 రకాల భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ చట్టం ద్వారా రైతులు ఏజెన్సీ ప్రాంతంలో పట్టాలు పొందక పోయినప్పటికీ కాస్తు, అనుభవం కాలమ్‌లో రైతుల పేర్లు నమోదు అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో సుమవ వాణి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పలువురు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

టేకుమట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని రామకి ష్టాపూర్(టీ)లో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెండెం సదానందం(51) కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న సదానందం జీవతంపై విరక్తిచెంది కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటి ఆవరణంలో వ్యవసాయ బావిపై ఉన్న దూలానికి ఉరివేసుకున్నారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

మహదేవపూర్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాళేశ్వరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ గంటా రాంనారాయణగౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. గతంలో ఆయన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సీమంతం

మహాముత్తారం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మండలంలోని 60 అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతం చేశారు. తనంతరం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావుతో కలసి సీడీపీవో రాధికరెడ్డి మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం ప్రాధాన్యాన్ని వివరించారు. అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. ప్రభుత్వ వైద్యురాలు దీప్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరాణి, వీణ, శివారాణి, గ్రామకార్యదర్శి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలిసుంటేనే సమస్యల పరిష్కారం

కృష్ణకాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ స్టాఫ్ కలిసుంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేష్ అన్నారు. కేటీకే ఓసీ3 అండర్‌మైన్‌లో ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ శంకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమా వేశంలో రమేష్ మాట్లాడారు. మైనింగ్‌స్టాఫ్‌కు ఎళ్లవేళలా ఏఐటీయూసీ అండగా ఉంటుందన్నారు. ఈ నెల 20న జరిగే మీటింగ్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ శ్రీకాంత్, ఆర్గనైజర్ జగత్ రావు, టెంపుల్ కమిటీ చైర్మన్ జె. శంకర్, సలహా దారు ఎస్. శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వడదెబ్బతో కూలీ మృతి

ఏటూరునాగారం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) వడదెబ్బతో కూలీ మృతి చెందిన సంఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఒకటో వార్డుకు చెందిన వ్యవసాయ కూలీ పలిశెట్టి వెంకటేశ్వర్లు (52) వ్యవసాయ కూలీగా పనిచే సేవాడు. రోజులాగే పనికి వెళ్లొచ్చిన వెంకటేశ్వర్లుకు రాత్రి సమయంలో వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో ఇంటి వద్దనే మృతి చెందాడని భార్య రమణ తెలిపింది. మృతునికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లారీ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

కృష్ణకాలనీ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని లారీల అడ్డా సమీపంలో లారీ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణరావు గురువారం శంకుస్థాపన చేశారు. అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు క్రషి చేస్తానన్నారు. ఏదైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ అధ్యక్షులు మేకల చంద్రయ్య, ఉపాధ్యక్షుడు కౌటం సురేందర్, ప్రధాన కార్యదర్శి ఎండీ అన్వర్, సహాయ కార్యదర్శి ఎనగంటి రమే ష్, కోశాధికారి తక్కళ్లపల్లి తిరుపతిరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల పాలిట వరం 'భూభారతి'

గణపురం (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం రైతుల పాలిట వరమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా రైతుల భూములకు పట్టాలు, భూమి హక్కులు లేక రైతులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని భూభారతి చట్టం ద్వారా అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం చేసి రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. ధరణిలో అనేక అవినీతి, అక్రమాలు జరిగినందుకే దానికి స్వస్తి పలికి రాష్ట్ర ప్రభుత్వం భూభారతి ఆర్‌వోఆర్ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో రవి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

అనుమతులు లేకున్నా రోడ్డు పనులు ఎందుకు?

రహదారి నిర్మాణంపై నిజనిర్ధారణ కమిటీ విస్మయం

రేగొండ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : బాగిర్తిపేట క్రాస్ నుంచి బుద్దారం వేస్తున్న రోడ్డు పనులకు అటవీ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వకపోయినా ఆగమేఘాల మీద చేపట్టడం ఏమిటని మానవ హక్కుల వేదిక నిజనిర్ధారణ కమిటీ ప్రశ్నించింది. 'ఇంత పెద్ద రోడ్డెందుకు?!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం కథనం ప్రచురితమైన నేపథ్యంలో మావన హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బదావత్ రాజు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దిలీప్, కార్యదర్శి కర్ణాటక సమ్మయ్య గురువారం పర్యటించారు. రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోతున్న రైతులను కలిసి వివరాలు సేకరించారు. మొరం కోసం కాంట్రాక్టర్ తవ్విన కందకాలను పరిశీలించారు. అవసరానికి మించి పెద్దగా వేస్తున్న రోడ్డును చూసి రైతుల అభిప్రాయాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా చేస్తున్న ఈ అబివృద్ధి పనులు ఎవరి కోసమని ప్రశ్నించారు. బుద్దారం గ్రామానికి ఇప్పటికే రెండు మార్గాల ద్వారా బాగిర్తిపేట క్రాస్‌కు చేరుకునే అవకాశం ఉందని, అయినా అదనంగా రోడ్డు వేయడం ఎందుకని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సుమారు రెండు కిలోమీటర్ల పరిధిలోనే ఈ రోడ్డు నిర్మాణంతో 20-30 మంది రైతులు భూములు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'జై సంవిధాన్'

గోవిందరావుపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలగడ్డ, కోటగడ్డ, పాపయ్యపల్లి, రాంనగర్ గ్రామాల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రస్పూత్ సీతారానాయక్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం గురువారం జరిగింది. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగా కల్యాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో పార్టీ జెండాను ఎగురవేశారు. కుల, మత, లింగ, ప్రాంత, ధనిక, పేద తారతమ్యాలు లేకుండా అతి పెద్ద రాజ్యాంగాన్ని నిర్మించేలా అంబేద్కర్‌కు కాంగ్రెస్ చొరవ చూపిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం కోసమే కాంగ్రెస్ సమూహంగా ఏర్పడిందని అన్నారు. పార్టీ తెలంగాణ రాష్ట్రంలో వినూత్న పథకాలతో అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతుందని పేర్కొన్నారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టేందుకే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా కాంగ్రెస్ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందిస్తామని, వారికి మంత్రి సీతక్క అండగా ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, దాసరి సుధాకర్, సూదిరెడ్డి జనార్దన్‌రెడ్డి, తేళ్ల హరిప్రసాద్, జంపాల ప్రభాకర్, పెండెం శ్రీకాంత్, మద్దాల నాగమణి, భూక్య రాజు, జంపాల చంద్రశేఖర్, వెంకటేశ్ తదితరులుపాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాకు చెక్

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీలో మత్తు పదార్థాల రవాణాను అరికట్టేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ కెమెరాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు దక్షిణ విభాగపు రేంజర్ అబ్దుల్ రహ్మాన్ తెలిపారు. మండలంలోని అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్టాగ్ చెక్‌పోస్టు వద్ద నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్వో మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతరత్రా మత్తు పదార్థాలు ఏజెన్సీ నుంచి పట్టణాలకు తరలిపోతే వెంటనే కెమెరాల్లో నిక్షిప్తమవుతుందని తెలిపారు. హైదరాబాద్‌లోని నార్కోటిక్ కార్యాలయానికి వీడియోలు, ఫొటోలు అప్‌లోడ్ అవుతాయన్నారు.

ఆదివాసీ చట్టాలను అమలు చేయాలి

వెంకటాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తాటి నాగరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు ప్రత్యేక హక్కులు ఉన్నప్పటికి అవి అమలు కావడం లేదన్నారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈనెల 20న నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్పా రాజు, ఉయిక గోపి, శ్యామల కృష్ణ, ఈశ్వర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

50 ఏళ్లు పైబడిన వారికి కంటి వైద్య శిబిరం

కన్నాయిగూడెం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో 50 ఏళ్లు పైబడిన వారికి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినవ్ భాగవతుల, ఆప్తాలమిక్ ఆఫీసర్ డాక్టర్ తిరుపతిరావు ఆధ్వర్యంలో గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 ఏళ్లు పైబడిన వారికి ఉచితంగా బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. కంటి సమస్యల గురించి వివరించి తీసుకోల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. సర్జరీకి అవసరమైన 23 మందిని గుర్తించి జిల్లా దవాఖానకు రెఫర్ చేశామన్నారు. వారికి సోమవారం ఉచితంగా కంటి ఆపరేషన్ జరుగుతుందని వివరించారు.

వాజేడులో క్షయ నిర్ధారణ పరీక్షలు

వాజేడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో గురువారం క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహిం చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, టీబీ ప్రోగాం ఆఫీసర్ ఆదేశాలతో పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో క్షయ లక్షణాలతో బాధపడుతున్న 15 మందిని ఆశా కార్యకర్తలు గుర్తించగా వారికి వ్యాధి నిర్ధారణకు పరీక్షలు నిర్వహించినట్లు వాజేడు వైద్యాధికారి మహేందర్ తెలిపారు. ఈ కార్యక్ర మంలో హెచ్‌ఎస్ కోటిరెడ్డి, ఎల్‌టీ రజినికాంత్, రవి, హెచ్‌ఏ శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు రమణమ్మ, కళావతి, లక్ష్మి పాల్గొన్నారు.

కాలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు

వాజేడు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతూరు సమీపంలోని లక్ష్మీపురం క్రాస్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు గడ్డికి నిప్పు పెట్టడంతో మిషన్ భగీరథ పైప్‌లైన్ కాలిపోయింది. దీంతో తక్షణమే పంచాయతీ సిబ్బంది, మిషన్ భగీరథ సిబ్బంది కాలిపోయిన పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధించారు. జీజీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

ములుగు సీఐగా సురేష్

ములుగు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ములుగు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ధారం సురేష్‌ను నియమించారు. ఈ మేరకు మల్టీ జోన్ -1 ఐజీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ శంకర్‌ను డీఎస్‌బీకి బదిలీ చేశారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

తాడ్వాయి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇమ్మడిగూడెం తండాలో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై గురువారం పోలీసులు దాడులు జరిపారు. 20 గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. 100లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎస్సై తెలిపారు. తయారీదారులను తహసీల్దార్ వద్ద బైండవర్ చేసినట్లు తెలిపారు.

'లంబాడీ నాయ వేదిక' ప్రధాన కార్యదర్శిగా బాలాజీ

ములుగు రూరల్, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి): లంబాడీ న్యాయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దేవగిరిపట్నం గ్రామానికి చెందిన బాలాజీ నాయక్ (బబ్లీ)ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు దేవానాయక్ ఉత్వర్వులు జారీ చేశారు.

చోరీ కేసులో ఇద్దరిపై కేసు నమోదు

ఏటూరునాగారం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద గల స్కై విజన్ డిజిటల్ కార్యాలయంలో ఈనెల 9వ తేదీన చోరీ జరిగిందని, ఈ ఘటనకు సంబంధించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తాజుద్దీన్ గురువారం తెలిపారు. దర్యాప్తులో భాగంగా రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించామని పేర్కొన్నారు. మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన అక్కిపెల్లి రాఘవ, గార నిశాంత్(పండు) స్కై విజన్ కార్యాలయానికి చేరుకొని షైఅంతస్తులో ఉన్న సెటప్ బాక్సులను దొంగిలించినట్టు తేలిందన్నారు. సెటప్ బాక్సులను స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో రిమాండ్

కన్నాయిగూడెం , ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న అర్ధరాత్రి మద్యం మత్తులో ఒక వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన బౌతు రాజుపై దుర్గం మహేష్ కత్తితో దాడి చేసి గాయ పరిచి పరారీ అయ్యాడు. బాదితుడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకునిదుర్గం మహేష్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.